పాఠశాలలకు గడ్డు రోజులు

- రెండు నెలల తర్వాత విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు
- అమ్మకు వందనానికి ఈ ఏడాది మంగళం
- పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

దేవరపల్లి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. విద్యా రంగానికి చేసే ఖర్చును పెట్టుబడిగా కాకుండా, భవిష్యత్తు తరాల ఉన్నతికి మన వంతు బాధ్యతగా భావించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెప్పేవారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన నాడే విద్యార్థులందరికీ విద్యా కానుకల కిట్లు అందించేవారు. సాంకేతిక విద్యపై అవగాహన కోసం తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఖరీదైన ట్యాబ్‌లు కూడా ఇచ్చారు. తల్లిఒడి పథకం కింద పాఠశాలలకు వెళ్లే పిల్లల ఖాతాలకు రూ.15,000 చొప్పున జమ చేసేవారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా నాటి ప్రభుత్వం చూసుకుంది. అయితే ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాలల్లో పరిస్థితులు మారాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉందనే కుంటి సాకులు చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యారంగాన్ని అన్నివిధాలా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్య మళ్లీ సంక్షోభం దిశగా పయనిస్తోంది.

ఆలస్యంగా విద్యా కానుకలు

వేసవి సెలవుల అనంతరం బడులు తెరవగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు విద్యాకానులు అందించే వారు. అటువంటిది, ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల వరకూ విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తూనే ఉన్నారు.

ఉపాధ్యాయుల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. కొవ్వూరు డివిజన్‌లో136 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయవలసి ఉంది. తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఒకే తరగతి గదిలో అన్ని తరగతులూ నిర్వహిస్తున్నారు. అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు.

పాత మెనూ..కొత్త పేరు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పేరును ప్రభుత్వం మార్చింది. మెనూ మాత్రం పాతదే అమలు చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో 85 నుంచి 90 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరత లేదు



మండలంలో ఉపాధ్యాయుల కొరత లేదు. విద్యార్థులకు ఇప్పటికే పాఠ్య పుస్తకాలు అందజేశాం. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాం. బిల్లులు ఏమీ పెండింగ్‌లో లేవు.

– సీహెచ్ బాలామణి, ఎంఈవో, తాళ్లపూడి

శాకంబరిగా నాగారమ్మ వారు


శాకంబరిగా బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ వారు


పాలంగిలో శాంకంబరిగా బాలా త్రిపుర సుందరి అమ్మ


తీపర్రులో చింతాలమ్మ వారికి సమర్పించిన సారె

చాగల్లు: ఆషాఢ మాసం ఆదివారంతో ముగుస్తున్న సందర్భంగా భక్తులు అమ్మవార్లకు సారె కావిడలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ వారిని వివిధ రకాల కూరగాయలతో ఆదివారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లతో సారె కావిడ సమర్పించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా సారె కావిడతో విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పురోహితుడు డి.వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలంగిలో బాలా త్రిపుర సుందరి..

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారు ఆదివారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలకరించారు. అర్చకుడు వి.రఘుశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చింతాలమ్మకు ఆషాఢం సారె సమర్పణ

పెరవలి: మండలంలోని తీపర్రు గ్రామంలో కొలువైన చింతాలమ్మ వారికి గ్రామస్తులు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. గ బాజా భజంత్రీలతో గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సారెలో 30 రకాల పిండి వంటలు, వివిధ రకాల పండ్లు, చీర, రవిక, పసుపు, కుంకుమలు ఉన్నాయి.

దూబచర్లలో పట్టపగలే చోరీ

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల గ్రామంలో శనివారం పట్టపగలే ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన పంచదార రాజేష్ తమ కుటుంబ సభ్యులతో కలసి శనివారం ఉదయం ఇంటికి తాళాలు వేసి ఈస్ట్ యడవల్లిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా తాళాలు తెరచి ఉన్నాయని అందులో భద్రపరిచిన 4 కాసుల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు కనపడకుండా పోయాయి. దీనిపై నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం విచారణ చేపట్టి హెడ్ కానిస్టేబుల్ పృథ్వీ కేసు నమోదు చేశారు.

కళాకారుల సంఘటిత శక్తే సంస్కార భారతి


కొవ్వూరులో నిర్వహించిన సంస్కార భారతి రాష్ట్ర వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

కొవ్వూరు: అన్ని రంగాల్లోని కళాకారులు, కళాభిమానుల సంఘటిత శక్తియే సంస్కార భారతి అని రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య అన్నారు. సంస్కార భారతి రాష్ట్ర వార్షికోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఆదిత్య మాట్లాడుతూ కళా మాధ్యమాల ద్వారా సమాజ హిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్కారభారతి నలభై ఏళ్లుగా దేశ వ్యాపంగా పని చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సమితుల నుంచి కార్యక్రమానికి హాజరైన సభ్యులు తమతమ ప్రాంతాల్లో సంస్కార భారతి ద్వారా చేస్తున్న సేవల వివరాలు వెల్లడించారు. స్థానిక కళాకారులు సప్పా దుర్గాప్రసాద్, చేగొండి సత్యనారాయణలు సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శులు టీఎస్‌వీ రమణ మూర్తి, దక్షిణ క్షేత్ర ప్రముఖ్ శేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మాదిగ చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు


కోరుపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం

నిడదవోలు రూరల్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు అన్నారు. మండలంలోని డి.ముప్పవరం, కోరుపల్లి, కలవచర్ల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, బాబూ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా చెట్టే రాజు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థతో అలుపెరగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కేఎస్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు మారుగుడి సురేష్, నేకూరి ప్రవీణ్, ముప్పిడి విజయ్, ముప్పిడి వెంకట్రావు, రామచంద్రరావు, ముప్పిడి సతీష్, ఎన్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు

నిడదవోలు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతుల సాగు అవసరాల మేరకు ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,800, సెంట్రల్ డెల్టాకు 1400, పశ్చిమ డెల్టా పరిధిలోని ఏలూరు కాలువకు 613, నరసాపురం కాలువకు 1342 , తణుకు కాలువకు 275, అత్తిలి కాలువకు 108 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

గోదారి తీరంలో దాహం.. దాహం


మంచినీటి ట్యాంకర్లు వస్తే తప్ప గొంతు తడవని దుస్థితి. తాగునీటి కోసం బిందెలు పట్టుకుని గంటల కొద్దీ మహిళల నిరీక్షణ. నిత్యం ప్రజలకు తప్పని తాగునీటి తిప్పలు. ఇది ఎక్కడో మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోనో, ఎత్తైన మెట్ట ప్రాంతంలోనో కాదు. గోదావరి చెంతనే ఉన్న నిడదవోలు పట్టణంలో..

- నిడదవోలు మున్సిపాలిటీలో తాగునీటి కష్టాలు
- గొంతెండుతున్న శివారు ప్రాంతవాసులు
- ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- శిథిలమైన పైపులైన్లకు తరచూ లీకేజీలు


నంగాలమ్మ పూరిగుడి సమీపంలో పైప్‌లైన్ మరమ్మతులు



ట్యాంకర్ నుంచి తాగునీటిని పట్టుకుంటున్న తీరుగూడెం వాసులు


శిథిలావస్థకు చేరిన నెహ్రూనగర్ మంచినీటి రిజర్వాయర్

నిడదవోలు: కళ్లముందే గోదావరి జలాలు ప్రవహిస్తున్నా తాగునీటి కోసం పట్టణ ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారు. వేసవిలోనే కాదు, వర్షా కాలంలోనూ దప్పిక తీరక అల్లాడుతున్నారు. శిథిలావస్థకు చేరిన పైపులైన్లు రోజూ ఏదో ఒకచోట లీకేజీలు ఏర్పడడంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పైప్ లైన్ మరమ్మతుల కోసం సరఫరాను నిలిపి వేయడంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. నిడదవోలు పట్టణంలోని తీరుగూడెం, ఇందిరానగర్, మున్సిపల్ క్వార్టర్స్, నాలుగో వార్డు ప్రాంతాల్లో కుళాయిల ద్వారా తాగునీరు సన్నటి ధారలా వస్తోంది. ఒక్కోసారి అది కూడా రావడం లేదు. అధికారులు ట్యాంకర్ల ద్వారా ఉదయం, సాయంత్రం నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని సుమారు 1,200 కుటుంబాల వారు ట్యాంకర్ల నీటిపై ఆధారపడ్డారు. అవి ఎప్పుడొస్తాయో తెలియక మహిళలు పనులు మానుకుని పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

పూటకు 22.5 లక్షల లీటర్ల నీటి సరఫరా

పట్టణంలోని 28 వార్డుల్లో 45,200 మంది జనాభా ఉన్నారు. మొత్తం 10,873 కుటుంబాలు నివశిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో మనిషికి రోజుకు 135 లీటర్ల తాగునీరు సరఫరా చేయాలి. ప్రస్తుతం 102 లీటర్ల నీటిని మాత్రమే అందిస్తున్నారు. జనాభాకు సరిపడా మంచినీరు సరఫరా చేయడం లేదు. స్థానిక నెహ్రూనగర్‌లోని 14.70 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రధాన ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి, లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితం అవుతోంది. అలాగే బాలాజీనగర్‌లోని 50 లక్షల లీటర్ల సామర్థ్యం, బసిరెడ్డిపేటలోని 75 వేల లీటర్ల సామర్థ్యం, ఎంవీ నగర్‌లో 85 వేల లీటర్ల సామర్థ్యం, తీరుగూడెంలో 50 వేల లీటర్ల సామర్థ్యం, లింగంపల్లిలో 70 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వాటి ద్వారా పట్టణంలోని 28 వార్డులకు పూటకు 22.50 లక్షల లీటర్ల చొప్పున తాగునీరు సరఫరా చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపడా వాటర్ ట్యాంకులు లేకపోవడంతో తాగునీటి లభ్యత తక్కువగా ఉంది.

మోటార్ల ద్వారా ట్యాంకుల్లోకి..

మున్సిపల్ కుళాయిల్లోని తాగునీటిని కొందరు మోటార్ల ద్వారా తమ ఇళ్లలోని ట్యాంకులు నింపుకుంటున్నారు. ఫలితంగా శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. మరి కొన్ని ప్రాంతాలకు సన్నని ధారగా తాగునీరు సరఫరా అవుతోంది. అనధికార మోటార్ల నివారణపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. నీటి వినియోగం ఎక్కువగా ఉండే వేసవిలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. స్థానిక వైఎస్సార్ కాలనీలో కొత్తగా ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించనున్నారు. రూ. 5.3 కోట్ల వ్యయంతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. అలాగే 16 వార్డులోని సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ సమీపంలో 7 లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్, వీక్లీ మార్కెట్ వద్ద 10 లక్షల కెపాసిటీ గల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. మంచినీటి సంపు, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను నింపుకోవడానికి, రోజూ తాగు నీటి సరఫరా విధుల్లో 9 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్లు

పట్టణంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, రోజూ ఏదో ఒకచోట లీకేజీలు ఏర్పడి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. పట్టణ పరిధిలో 67 కిలోమీటర్ల పొడవునా తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. ఏటా పైపులైన్ల మరమ్మతుల కోసం మున్సిపల్ సాధారణ నిధులను రూ.10 లక్షలు కేటాయిస్తున్నారు. పనులు మాత్రం తూతూ మంత్రంగా చేయడంతో శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. గతేడాది జనవరిలో నెహ్రూనగర్ ఓవర్ హెడ్ ట్యాంక్ పరిధిలోని ప్రధాన పైప్‌లైన్ పాడవడంతో దాదాపు నెల పాటు అక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. చివరకు రాజమహేంద్రవరం నుంచి టెక్నీషియన్లను రప్పించి పనులు పూర్తి చేశారు. శిథిలమైన పాత పైపులైన్లను పూర్తిగా తొలగించి, కొత్తగా పైపులైన్లు నిర్మిస్తే తప్ప ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. ఇందుకోసం ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాల్సి ఉంది.

క్లుప్తంగా

వాయనాడ్ మృతులకు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి


వాయనాడ్ మృతులకు ఆత్మశాంతి కలగాలంటూ చర్చిలో ప్రార్థనలు

కొవ్వూరు: కేరళలోని వాయనాడ్, చూర్‌మలా వద్ద సంభవించిన ప్రకృతి విలయంలో మృతువాత పడిన 359 మంది ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మండలంలోని వేములూరు గ్రామంలోని పునీత అస్సీసిపుర ఫ్రాన్సిస్ దేవాలయంలో ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. చర్చి ఫాస్టర్ పసల ఫ్రాన్సిస్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారంతా త్వరితగతిన కోలుకోవాలంటూ ప్రార్థనలు చేశారు. దీప్తి పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ప్రణయ్, పాఠశాల సిబ్బంది, చర్చి పెద్దలు వి.నెల్సన్ ఆంటోనీ, వీటీ విల్సన్‌రాజు, డి.జాన్, ఎస్.ప్రభాకర్, టి.శ్రీనివాస్, కిషోర్ సింగ్, పి.రాజేష్, డి.ఆశీర్వాదం, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు శిథిలం.. ప్రయాణికులకు సంకటం


గౌరీపట్నం తామర చెరువు వద్ద శిథిలమైన కల్వర్టు

దేవరపల్లి: గౌరీపట్నంలోని తామర చెరువు కల్వర్టు శిథిలం కావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గౌరీపటన్నం-అన్నదేవరపేట రోడ్డులో గౌరీపట్నం గ్రామ శివార్లలో తామర చెరువు ఉంది. వర్షాకాలం చెరువు నిండగా, మిగులు జలాలు కల్వర్టు ద్వారా దిగువకు పారతాయి. కల్వర్టు శిథిలం కావడంతో సుమారు రెండుమీటర్ల లోతున వాగు ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గౌరీపట్నం నుంచి వెంకటాయపాలెం, చిట్యాల, అన్నదేవరపేట, తాళ్లపూడి గ్రామాలకు దగ్గర మార్గం కావడంతో ఎక్కువ మంది ప్రజలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తారు. దాదాపు పదేళ్లుగా కల్వర్టు ఇదే స్థితిలో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని వారు కోరుతున్నారు.

శ్రావణ పూజలకు ఆలయాల ముస్తాబు

నల్లజర్ల: శ్రావణ మాస పూజలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకూ శ్రావణమాస వేడుకలు, పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. నల్లజర్లలోని వేణుగోపాలస్వామి, వనదుర్గ, తెలికిచెర్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, అనంతపల్లి గ్రామంలోని మదన గోపాలస్వామి, ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామివార్ల ఆలయాల్లో రోజూ ప్రత్యేక పూజలతో పాటు ప్రతి శుక్రవారం అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు అర్చకులు వెల్లడించారు. అలాగే పోతవరంలోని శివాలయం, కవులూరు పోలేరమ్మ ఆలయంలోనూ శ్రావణ మాస పూజలకు విశేష ఏర్పాట్లు చేశారు. ఈనెల 27న శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు జరుగుతాయన్నారు. అదేరోజు సాయంత్రం ఉట్టి కొట్టే సంబరం నిర్వహిస్తారన్నారు.

మహిళ వైద్యానికి 'మానవత' ఆర్థిక సాయం


మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: మండలంలోని చిడిపి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మిద్దే సత్యవతి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో రూ.ఆరు వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని సత్యవతికి అందించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సనపల రాజశేఖర్, గెడ్డం సాయిబాబా, అప్పన హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, పామెర్ల నగేష్, టీఎన్‌బీ గుప్త, తడికొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోగి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై అదృశ్యం కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని శంకరాపురానికి చెందిన వల్లపురెడ్డి సత్తిబాబు (41) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేష్ చెప్పారు.

కొత్త ఎస్సైల నియామకం


కొవ్వూరు రూరల్ ఎస్సైగా నియమితులైన శ్రీహరిరావు


తాళ్లపూడి ఎస్సైగా నియమితులైన రామకృష్ణ

కొవ్వూరు: కొవ్వూరు డివిజన్‌లోని పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. దేవరపల్లి ఎస్‌ఐగా పని చేస్తున్న కె. శ్రీహరిరావును కొవ్వూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. సీతానగరం ఎస్సై టి.రామకృష్ణను తాళ్లపూడి ఎస్సైగా నియమించారు. ప్రస్తుతం రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న కె.సుధాకర్ కాకినాడ జిల్లాకు వెళ్లనున్నట్టు సమాచారం.

దేవరపల్లికి సుబ్రహ్మణ్యం

దేవరపల్లి: బదిలీ అయిన దేవరపల్లి ఎస్‌ఐ కె.శ్రీహరిరావు స్థానంలో తాడేపల్లిగూడెం ట్రాఫిక్ స్టేషన్ ఎస్సై వి.సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు.

పెరవలి ఎస్సైగా అప్పారావు

పెరవలి: పెరవలి ఎసైగా నిడదవోలులో పని చేస్తున్న పి.అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పారావు పెరవలి స్టేషన్‌లో విధుల్లో చేరవలసి ఉంది. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఏజీఎస్ మూర్తి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయినట్టు సమాచారం.

మినీ జేసీబీ సాయంతో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


ఎస్.ముప్పవరంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు: ప్రస్తుతం వర్షాకాలం అయినందున గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నామని ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ఎండీ ఆలీ చెప్పారు. గ్రామ పంచాయతీల్లో కచ్చా డ్రైన్‌లు తీసేందుకు, పక్కా డ్రైన్‌లలో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు కొవ్వూరు డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ ఆధ్వర్యంలో మినీ జేసీబీ ఏర్పాటు చేశారన్నారు. ఈ జేసీబీ సాయంతో మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఎస్.ముప్పవరం గ్రామంలో పనులు చేశామని చెప్పారు. మినీ జేసీబీ సాయంతో మండలంలో 30 రోజుల పాటు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని వివరించారు.

ఆశాజనకంగా ఖరీఫ్ వరి పైరు


పెరవలిలో వరి చేనుకు ఎరువు వేస్తున్న రైతులు

పెరవలి: ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. వర్షాలు కురవడంతో చేలు ఏపుగా పెరిగాయి. ఇప్పటి వరకూ చీడపీడలు బెడద లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నిడదవోలు నియోజకవర్గ పరిధిలో ఈ ఖరీఫ్‌లో 36,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేపట్టారు. మండలాల వారీగా పెరవలిలో 8,500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 11,500, నిడదవోలులో 16,500 ఎకరాల్లో వరినాట్లు వేశారు. రబీ పంటకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. మూడు మండలాల పరిధిలోని సొసైటీలు, ఎరువుల డీలర్లు దగ్గర ప్రస్తుతం నత్రజని ఎరువులు 600 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 500 టన్నులు, పొటాష్ 200 టన్నులు, డీఏపీ 300 టన్నులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. వరినాట్లు వేసిన చేలు ప్రస్తుతం 20 నుంచి 35 రోజుల వయసులో ఉన్నాయి.

వీటీ కాలేజీ పూర్వ విద్యార్థుల కలయిక

కంబాలచెరువు: స్థానిక వీటీ జూనియర్ కాలేజీలో 1972, 74 బ్యాచ్ ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిశారు. వేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాలులో డాక్టర్ దాట్ల భాస్కరరాజు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పలువురు వచ్చారు. ముందుగా వీరేశలింగం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.